ఎయిర్‌పోర్టులో 'ఈ శ్రామ్' నమోదు



శంషాబాద్: రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గిగ్, ప్లాట్‌ఫాం కార్మికులకు ఈ శ్రామ్ నమోదు శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. భారత కార్మిక శాఖ పరిధిలోని నేషనల్ బోర్డ్ ఫర్ వర్కర్స్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్, తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ యూనియన్‌తో కలిసి ఈ శిబిరాన్ని నిర్వహించింది. ఈ నెల 5 వరకు విమానాశ్రయంలో ఈ శ్రామ్ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫారమ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ తెలిపారు. క్యాబ్‌డ్రైవర్లు, ఇతర గిగ్‌వర్కర్లు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

బీజేపీ ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు మల్లేష్ మృతి



తుండుపల్లి మల్లేష్ (ఫైల్)

రాజేంద్రనగర్: బీజేపీ ఎస్సీ మోర్చా రాజేంద్రనగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు తుండుపల్లి మల్లేష్ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసానికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్‌తో పాటు పలువురు నాయకులు మల్లేష్ మృతదేహంపై పార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఆయన పార్థివదేహానికి అంత్యక్రియలు రాజేంద్రనగర్‌లోని శ్మశాన వాటికలో నిర్వహించారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి/రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చేపట్టిన పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. కొండాపూర్ డివిజన్‌లో రూ.2.50 కోట్లతో, గచ్చిబౌలి డివిజన్‌లో రూ.1.56 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ప్రజలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. శేరిలింగంపల్లిని ఆదర్శ నియోజకవర్గంగా తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, హమీద్‌పటేల్, నాయకులు, జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

జలకళ

నిండుకుండల్లా చెరువులు, కుంటలు

జులై, ఆగస్టులో అధిక వర్షపాతం

పెరిగిన భూగర్భ జలమట్టాలు

ప్రజలు.. రైతుల్లో హర్షాతిరేకాలు



పాల్మాకుల చెరువు వద్ద అలుగు

శంషాబాద్ రూరల్: భారీ వర్షాలతో చెరువులు, కుంటలు జల కళ సంతరించుకున్నాయి. ఐదేళ్ల తర్వాత నిండుకుండలను తలపిస్తున్నాయి. శంషాబాద్ మండల పరిధిలో జులై, ఆగస్టు నెలల్లో అధిక వర్షపాతం నమోదు కావడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు, కుంటలు అలుగు పారాయి. దీని కారణంగా భూగర్భ జలాలు పెరిగి సాగు పనులు జోరందుకున్నాయి. తాగు, సాగునీటికి మరో రెండేళ్ల వరకు ఇబ్బందులు తొలగిపోయినట్లు స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పారుతున్న వాగులు..

మండల పరిధిలో ఉన్న ఈసీ, ఎంటేరు వాగుల్లో వరద పారుతోంది. పాల్మాకులలో ఉన్న మైసమ్మ చెరువు నుంచి వస్తున్న వరద ఎంటేరువాగు గుండా వెళ్తుంది. ఈ రెండు వాగుల్లోని వరదనీరు హిమాయత్ సాగర్ జలాశయంలో చేరుతోంది.





నిండుకుండలా రామంజాపూర్ రేకులకుంట



మల్కారం చెరువుకు జల కళ



బోటిగూడలో నిండిన కుంట

కేబుల్స్‌ను తొలగించండి



మణికొండ క్వార్టర్స్ బస్‌స్టాప్ వద్ద పడి ఉన్న కేబుల్ వైర్లు

మణికొండ: విద్యుత్ స్తంభాలకు ప్రమాదకరంగా ఉన్నాయనే కారణంతో తొలగించిన కేబుల్ వైర్లను రోడ్లపై నుంచి వెంటనే తొలగించి ప్రమాదాలను నివారించాలని మణికొండ మున్సిపాలిటీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా తొలగించిన కేబుల్ వైర్లను అనేక చోట్ల అలాగే వదిలేయటంతో అవి పాదచారులకు, వాహనదారులకు తగిలి ప్రమాదాలు జరుగుతున్నాయని వారు తెలిపారు. మున్సిపల్ అధికారులు తొలగిస్తారని విద్యుత్ అధికారులు, విద్యుత్ అధికారులు తొలగిస్తారని మున్సిపల్ అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోడ్లపై విద్యుత్ అధికారులు వాటిని తొలగించి మిగతా చోట్ల తమ పని కాదన్నట్టుగా మిన్న కున్నారని, ఇకనైనా వారు స్పందించి మున్సిపాలిటీ వ్యాప్తంగా వాటిని వెంటనే తొలగించాలని పలు కాలనీల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సాయివైభవ్ కాలనీవాసులు

మణికొండ: గృహాలు నిర్మించుకుని ప్రజలు జీవిస్తున్నా రోడ్లు వేయకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మున్సిపల్ అధికారులకు చెప్పి రోడ్లను వేయించాలని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని జనచైతన్య, సాయి వైభవ్ కాలనీ వాసులు ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్‌ను కోరారు. బుధవారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మీశ్రీ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేసినట్లు కాలనీ సంక్షేమ సంఘం కార్యదర్శి టీఎస్ రెడ్డి తెలిపారు. రోడ్లు లేకపోవటంతో వర్షాలు కురిసిన సమయంలో బురదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. దాంతో స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే రోడ్లు వేయిస్తామని హామీ ఇచ్చారన్నారు. కాలనీ నేతలు వంశీకృష్ణ, డాక్టర్ రాంమోహన్‌రెడ్డి, మోహన్‌రావు, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉండాలి



బ్యాగులను అందజేస్తున్న గణేష్‌కుమార్

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు వ్యాపార, ఐటీ, సేవా సంస్థలు అండగా ఉండాలని గండిపేట మాజీ సర్పంచ్ గోపాల గణేష్‌కుమార్ అన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు గోల్కొండ రిసార్ట్ ఎండీ ఎస్.సురేష్‌రెడ్డి తన 60వ పుట్టినరోజు సందర్భంగా 400 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ... ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో తృప్తినిస్తాయన్నారు. ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న వారు లేని వారికి తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. గోల్కొండ రిసార్ట్ ఇంచార్జి శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేతిబౌలి చౌరస్తాలో మల్టీలెవల్ ఫ్లై ఓవర్

గోల్కొండ: ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రేతిబౌలి చౌరస్తా వద్ద తలపెట్టిన కొత్త ఫ్లై ఓవర్ పరిసరాలను బల్దియా ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి బుధవారం పరిశీలించారు. వివిధ శాఖల అధికారులకు ఆయన మెహిదీపట్నం నుంచి రేతిబౌలి చౌరస్తా, నానల్‌నగర్ వరకు పర్యటించారు. రూ. 398 కోట్లతో మల్టీలెవల్ ఫ్లైఓవర్ డ్రాఫ్ట్ నమూనాతో ఆయన రేతిబౌలి చౌరస్తా పరిసరాలు అక్కడ ట్రాఫిక్ తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యలు తదితర విషయాలపై ట్రాఫిక్, పోలీసు అధికారులతో చర్చించారు. రేతిబౌలి నుంచి నానల్‌నగర్ జంక్షన్ వరకు పనులు పూర్తయితే మెహిదీపట్నం నుంచి టోలిచౌకీ వరకు ట్రాఫిక్ తగ్గించే అవకాశం ఉందన్నారు. రెండో లెవల్ లంగర్‌హౌస్ నుంచి మెహిదీపట్నం వరకు ఈ పనులు ఉంటాయని ఆయన అన్నారు.

క్రీడలతో పరిపూర్ణ ఆరోగ్యం



క్రీడాపోటీలను ప్రారంభించిన ప్రిన్సిపాల్ అనిత

మణికొండ: క్రీడలు విద్యార్థులకు మానసిక, శారీరక ఉత్సాహంతోపాటు పరిపూర్ణ ఆరోగ్యంగా ఉంటుతాయని... అందుకే తమ పాఠశాలలో వాటిని తప్పనిసరి నిర్వహిస్తున్నామని మణికొండ శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ అనిత అన్నారు. బుధవారం పాఠశాలలో క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తరగతుల వారీగా టీములను చేసి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చదువులతో పాటు తమ విద్యార్థులకు అన్ని రంగాలలో తీర్చి దిద్దుతున్నామన్నారు. క్రీడలలో తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి వరకు ఎదిగారన్నారు. కార్యక్రమంలో క్రీడల ఇంచార్జి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

చైన్‌మెన్‌లకు పోస్టింగ్‌లు

గచ్చిబౌలి: బదిలీపై వచ్చిన చైన్‌మెన్‌లకు శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ బొర్ఖడే పోస్టింగ్‌లు ఇచ్చారు. టౌన్ ప్లానింగ్ చైన్‌మెన్‌లు ఆగస్టు 28న వెస్ట్ జోనల్‌లో రిపోర్ట్ చేశారు. మూసాపేట్ సర్కిల్ నుంచి వచ్చిన లింగంకు చందానగర్ సర్కిల్, ఎస్.విజయ్‌కుమార్‌కు యూసుఫ్‌గూడ, కూకట్‌పల్లి సర్కిల్ నుంచి వచ్చిన బి. లక్ష్మణ్‌ను శేరిలింగంపల్లి, జి.లచ్చయ్యను ఆర్సీపురం, పటాన్‌చెరు, చాంద్రాయణగుట్ట సర్కిల్ నుంచి వచ్చిన కరణ్‌కుమార్‌ను చందానగర్ సర్కిల్‌కు, ఖైరతాబాద్ సర్కిల్ నుంచి వచ్చిన మోహన్‌కుమార్, సత్యనారాయణకు శేరిలింగంపల్లి సర్కిళ్లకు కేటాయించారు.

నిమజ్జనోత్సవానికి భారీ ఏర్పాట్లు

రాజేంద్రగనర్ డీసీ సురేందర్ రెడ్డి



రాజేంద్రనగర్: సామూహిక గణేశ్ నిమజ్జన ఊరేగింపు నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పత్తికుంట, పల్లెచెరువు, మీరాలం చెరువుల వద్ద భారీ ఏర్పాట్లను చేపట్టినట్లు జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి వెల్లడించారు. బుధవారం తన కార్యాలయంలో 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. గణేశ్ ఉత్సవాల 9వ రోజు గురువారం భారీ ఎత్తున గణనాథులు నిమజ్జనానికి తరలి వస్తున్నట్లు తెలిపారు. పత్తికుంట వద్ద 3 క్రేన్లు, పల్లె చెరువు, మీరాలం చెరువుల వద్ద ఒక్కొ క్రేన్‌ను ఏర్పాటు చేశామన్నారు. గణనాథుల నిమజ్జనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ క్రేన్ల సంఖ్యను పెంచుతామన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన గణనాథుల ప్రతిమలను ఎక్కువ సంఖ్యలో పత్తికుంటకు నిమజ్జనానికి తరలిస్తున్నట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా 3 క్రేన్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. క్రేన్లతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కొలనులో చిన్న ప్రతిమలను సిబ్బంది నిమజ్జనం చేస్తారన్నారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక సిబ్బంది విధుల్లో పాల్గొంటారన్నారు. మండపాల నిర్వాహకులతో పాటు ప్రజలకు ఇబ్బంది కలుగకుండా తగు ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు.

స్పెషల్ డ్రైవ్..

సామూహిక గణేశ్ ప్రతిమల నిమజ్జనం నేపథ్యంలో పత్తికుంట, పల్లె చెరువుల వద్ద స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు ఉప కమిషనర్ సురేందర్ రెడ్డి తెలిపారు. ప్రతిరోజు విధులు నిర్వహించే సిబ్బందితో పాటు అదనంగా సిబ్బందిని నియమించామన్నారు. ప్రధాన రహదారులతో పాటు చెరువుల వద్ద సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులను చేపడుతారన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్ శుక్రవారం సాయంత్రం వరకు కొనసాగుతుందన్నారు.

భారీ బందోబస్తు..

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 9వ రోజు గురువారం నిర్వహించనున్న సామూహిక గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తును నిర్వహిస్తున్నారు. ఊరేగింపు కొనసాగనున్న ప్రధాన రహదారిపై అడుగడుగున పోలీసులను నియమిస్తున్నారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన పికెట్‌లలో ఎస్‌ఐ స్థాయి అధికారి విధులు నిర్వహిస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి విధులు చేపడుతూ నిమజ్జన ఊరేగింపు పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు వివరిస్తున్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

గోల్కొండ: గణేష్ నిమర్జన ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ ఊరేగింపులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ కృష్ణగౌడ్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ వికలాంగుల సంక్షేమ సంఘం చైర్మన్ జాహెద్ అలీ బుధవారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో అదనపు డీసీపీని కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఏసీపీ తదితరులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ... నగరంలో ఇరువర్గాల పండుగలను పురస్కరించుకుని ఆధ్యాత్మిక వాతావరణం నెలకొందన్నారు. హైదరాబాద్ పండుగ శోభను సంతరించుకుందని ఇటువంటి సందర్భాలలో ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకుంటే నగర ప్రతిష్ఠ రెట్టింపు అవుతుందన్నారు. పోలీసులు ఊరేగింపుల నిర్వాహకులకు అన్ని వేళల అండగా ఉండి శాంతియుత వాతావరణంలో ఊరేగింపులు జరిగేందుకు పక్కా ఏర్పాట్లు చేశారన్నారు.



హైదర్షాకోట్‌లో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



మణికొండ కేపీఆర్ కాలనీలో మాజీ చైర్మన్ నరేందర్, జితేందర్



నార్సింగిలో...



శంషాబాద్ వివేకానంద కాలనీలో పర్యావరణహిత గణనాథుడు

వైభవంగా నవరాత్రి పూజలు



నార్సింగి హైట్స్ కాలనీలో..

వినాయక నవరాత్రి పూజలు రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. ఎనిమిదవ రోజు బుధవారం పలు మండపాలలో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున మండపాలకు తరలివస్తుండటంతో సందడి నెలకొంది. పెద్దలు పూజలలో పాల్గొంటుండగా పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. పలు మండపాల వద్ద అన్నదానాలను నిర్వహించటంతో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

– రాజేంద్రనగర్ జోన్ బృందం

రాజేంద్రనగర్ పోచమ్మ బస్తీలో..





మణికొండ హుడా కాలనీలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నేతలు



మణికొండలో మాజీ చైర్మన్, మాజీ వైస్ చైర్మన్‌లు



పుప్పాలగూడ రాఘవేంద్రకాలనీలో..



నార్సింగిలో కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్‌యాదవ్



బుద్వేల్ వరసిద్ధి వినాయక మండపంలో...



ఓంనగర్ కాలనీలో...



హైదర్‌గూడలో గణేశ్ నిమజ్జన ఊరేగింపులో యువకులు



శివరాంపల్లిలో పూజల్లో కార్పొరేటర్ అర్చన జయప్రకాష్



మైలార్‌దేవ్‌పల్లిలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి



హైదర్‌గూడలోని శివనగర్‌కాలనీలో...